

జలమండలి ద్వారా చేపట్టే పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బలాల

ఆజంపుర, చావునీ డివిజన్లలో రూ.4కోట్లతో అభివృద్ధి పనులు : ఎమ్మెల్యే బలాల

చాదర్‌ఘాట్, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): చావునీ, ఆజంపుర డివిజన్ల పరిధుల్లో రూ.4కోట్లతో అభివృద్ధి పనులను త్వరలో చేపట్టనున్నట్లు ఎమ్మెల్యే అహ్మద్ బలాల తెలిపారు. గురువారం ఆయన ఆజంపుర డివిజన్‌లో జీహెచ్‌ఎంసీ ఏఈ మల్లికార్జున్, వాసుప్రసాద్, జలమండలి మేనేజర్ నవీన్, జూనియర్ టెక్నికల్ ఆఫీసర్ మహేష్‌లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. కొత్తగా రూ.4కోట్లతో చేపట్టనున్న అభివృద్ధి పనుల్లో ఆజంపురలో రూ.2.50కోట్లతో, చావునీ డివిజన్‌లో రూ. కోటిన్నర నిధులు మంజూరయ్యాయని ఎమ్మెల్యే వివరించారు. సుమారు 20 అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు ఆయన తెలిపారు. వీటిలో కొత్తగా 14 సీసీ రోడ్ల నిర్మాణ పనులుండగా రెండు కమ్యూనిటీహాల్‌లకు అదనపు అంతస్తుల నిర్మాణ పనులు, మరో రెండు పార్కుల నిర్వహణ పనులు, ఒక ఫుట్‌పాత్ పనులున్నాయన్నారు. చంచల్‌గూడ రోషన్ డెయిరీ వద్ద రూ.33 లక్షలతో నిర్మించిన సీవరేజీ పైపులైన్ పనులను జలమండలి చంచల్‌గూడ మేనేజర్ నవీన్‌తో కలిసి ఎమ్మెల్యే పరిశీలించారు. అదేవిధంగా ఆజంపుర డివిజన్‌లోని మూసానగర్‌లో కొత్తగా నిర్మించనున్న సీవరేజీ, తాగునీటి పైపులైన్ నిర్మాణ పనులను జలమండలి జూనియర్ టెక్నికల్ ఆఫీసర్ మహేష్‌ను ఎమ్మెల్యే అడిగి తెలుసుకున్నారు.



సరూర్‌నగర్ చెరువు కట్టను సందర్శిస్తున్న కార్పొరేటర్లు శ్రీవాణిఅంజన్, బద్దం ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డి, గణేశ్ ఉత్సవ సమితి ప్రతినిధులు

సరూర్‌నగర్ మినీ ట్యాంక్‌బండ్‌ను పరిశీలించిన కార్పొరేటర్లు శ్రీవాణి, ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డి

ఎల్బీనగర్, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): ప్రతి సంవత్సరం వినాయచవితి వస్తుందని తెలిసి కూడా ఏర్పాట్లు చేయడంలో అన్ని విభాగాల అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని కార్పొరేటర్లు ఆకుల శ్రీవాణిఅంజన్, బద్దం ప్రేమ్‌మహేశ్వర్ రెడ్డి మండిపడ్డారు. గురువారం సరూర్‌నగర్ మినీ ట్యాంక్ బండ్‌ను గణేశ్ ఉత్సవ సమితి ప్రతినిధులతో కలిసి వారు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వినాయకచవితి, నిమజ్జనోత్సవం ఎప్పుడు వస్తుందో ముందే తెలిసీ కూడా ఏర్పాట్లు చేయకుండా అధికారులు నిమ్మకునీరెత్తినట్లుగా ఉంటూ హిందూ పండుగలను చిన్నచూపు చూస్తున్నారన్నారు. ఎక్కడైనా వినాయక విగ్రహాలను తీసుకురావడం నుంచి నిమజ్జనం వరకు భక్తులకు ఇబ్బందులు కలిగితే చూస్తు ఊరుకునేదిలేదని వారు హెచ్చరించారు. రోడ్ల మరమ్మతులు, డ్రైనేజీల మరమ్మతులు, మండపాల వద్ద సదుపాయాలు, విగ్రహాల రాకపోకల దారుల్లో చెట్లకొమ్మలు అడ్డురావడం, విద్యుత్ తీగలు తొలగించకపోవడం, నిమజ్జన మార్గం సుగమం చేయడం వంటి చర్యల్లో ఏ మాత్రం నిర్లక్ష్యం వహించరాదన్నారు. సరూర్‌చెరువు కట్ట అంచు విరిగిపోయే ప్రమాదమున్నదని అధికారులకు సూచనలు చేసినా నిద్రమత్తులో ఉన్నారని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. జరగరానిది ఏదైనా జరిగితే అధికారులను మాత్రం విడిచిపెట్టమని వారు హెచ్చరించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు, గణేశ్ ఉత్సవ సమితి ప్రతినిధులు పాల్గొన్నారు.

సాంకేతిక మార్పులకు అనుగుణంగా ముందుకు సాగాలి

అబ్దుల్లాపూర్‌మెట్, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): సాంకేతిక రంగంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా విద్యార్థులు ముందుకు సాగాలని జేఎన్‌టీయూహెచ్ వైస్ చాన్సలర్ (వీసీ) ప్రొఫెసర్ టీ. కిషన్‌కుమార్‌రెడ్డి సూచించారు. తట్టిఅన్నారంలోని శ్రేయాస్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలలో గురువారం బీటెక్ ఓరియంటేషన్ డే ఘనంగా జరిగింది. జేఎన్‌టీయూహెచ్ వీసీ కిషన్‌కుమార్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇంటర్ నుంచి బీటెక్‌కు వచ్చిన తర్వాత విద్యా ప్రస్థానంలో మార్పులు ఉంటాయని.. సమన్వయంతో మార్పులను పరిగణలోకి తీసుకుని ముందుకు వెళ్లాలని చెప్పారు. లైఫ్ స్కిల్స్ ఎంత ముఖ్యమో నిజాయితీ గల జీవితం అంతే ముఖ్యమన్నారు. పట్టుదల, క్రమశిక్షణతో చదువుకున్న విద్యార్థులు జీవితంలో ఉన్నత స్థానాల్లో నిలబడుతారన్నారు. కళాశాల వైస్ చైర్మన్ హ్రిదయరెడ్డి సాంకేతిక విద్యతో ఐటీ రంగంలో రాణించవచ్చన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సి. ఉదయ్‌కిరణ్, కళాశాల సెక్రెటరీ చింతల రవీంద్రనాథ్‌యాదవ్, చైర్మన్ అనంతుల వినయ్‌కుమార్‌రెడ్డి, హెచ్‌వోడీలు, అధ్యాపకులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి క్రికెట్ జట్టుకు సాయిప్రీతమ్‌రెడ్డి ఎంపిక

అబ్దుల్లాపూర్‌మెట్, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): తెలంగాణ స్టేట్ సీబీఎస్‌ఈ క్లస్టర్ సౌత్‌జోన్ నుంచి జాతీయ క్రికెట్ జట్టుకు పెద్దఅంబర్‌పేట్ లక్ష్మారెడ్డిపాలెం లోని క్యాండర్ వైన్ స్కూల్‌లో 9వ తరగతి చదువుతున్న కంచర్ల సాయి ప్రీతమ్ రెడ్డి ఎంపికైనట్లు స్కూల్ చైర్మన్ ఇ. మల్లారెడ్డి తెలిపారు. ఈనెల 14,15,16 తేదీల్లో తమిళనాడు రాష్ట్రంలో జరిగిన రాష్ట్రస్థాయి క్రికెట్ అండర్-17 బాలుర విభాగంలో ప్రీతమ్‌రెడ్డి మొదటి ప్లేయర్‌గా ఎంపికయ్యారని తెలిపారు. ఈ సందర్భంగా గురువారం స్కూల్‌లో ప్రీతమ్‌రెడ్డిని చైర్మన్ మల్లారెడ్డి, డైరెక్టర్ దివ్య, ప్రిన్సిపాల్ లక్ష్మయ్యతో పాటు ఉపాధ్యాయ బృందం అభినందించారు. స్కూల్‌లో విద్యతో సమానంగా క్రీడలకు ప్రాధాన్యత కల్పిస్తున్నట్లు వారు తెలిపారు.

సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కు అందజేత

చంపాపేట, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): సీఎం రిలీఫ్‌ఫండ్ పేదలకు ఎంతో ఉపయోగపడుతుందని టీపీసీ సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షుడు మిద్దెల జితేందర్ అన్నారు. సికింద్రాబాద్‌కు చెందిన సంపత్‌కుమార్ గొంతుకు సంబంధించిన వ్యాధితో కొన్ని రోజుల నుంచి ఇబ్బందిపడుతున్నారు. ఆపరేషన్ కోసం సహాయం చేయాలని సేవాదళ్ కార్యదర్శి శ్యామల రమణిని ఆశ్రయించారు. సంపత్‌కుమార్ ఆపరేషన్ ఖర్చుల కోసం ఆమె మిద్దెల జితేందర్ ద్వారా టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్ సహకారంతో సీఎం సహాయనిధికి దరఖాస్తు చేసుకున్నారు. చంపాపేట డివిజన్ కర్మన్‌ఘాట్‌లోని టీపీసీ సేవాదళ్ కార్యాలయంలో గురువారం మిద్దెల జితేందర్ సంపత్‌కుమార్‌కు సీఎం సహాయనిధి కింద మంజూరైన రూ.60వేల చెక్కును బాధితుడికి అందజేశారు. కార్యక్రమంలో నాయకులు బండి శ్యాంసుందర్, శ్యామల రమణి తదితరులు పాల్గొన్నారు.

పేదలకు ఆర్థిక భరోసా సీఎం రిలీఫ్ ఫండ్



సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును అందజేస్తున్న మధుయాష్కీగౌడ్

ఎల్బీనగర్, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు ఆర్థిక భరోసా కల్పిస్తున్నదని టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్ అన్నారు. అనారోగ్యంతో ప్రైవేటు ఆస్పత్రుల్లో చికిత్స పొందిన పలువురు తమ ఆర్థిక పరిస్థితుల రీత్యా మధుయాష్కీని సంప్రదించారు. స్పందించిన ఆయన వారికి సీఎం రిలీఫ్ ఫండ్ మంజూరు చేయించారు. ఎల్బీనగర్‌కు చెందిన బుచ్చమ్మకు రూ. 41,000, అయితగోని లోకేష్‌కు రూ.60,000, కర్మన్‌ఘాట్‌కు చెందిన శీతల్ గజ్బీంకర్‌కు రూ. 60,000లకు ఆయన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ వనస్థలిపురం డివిజన్ అధ్యక్షుడు కుట్ల నర్సింహయాదవ్, కొత్తపేట డివిజన్ అధ్యక్షుడు లింగాల కిశోర్‌గౌడ్, మహిళా నాయకురాలు స్వర్ణమాధవి, నాయకులు గోపాల్‌ముదిరాజ్, బాలకృష్ణ పాల్గొన్నారు.

కనెక్షన్.. కరప్షన్!

- వాటర్ కనెక్షన్లలో వసూళ్ల లొల్లి
- సోషల్ మీడియాలో ఆడియో, వీడియో రికార్డింగులు హల్‌చల్
- కార్పొరేటర్ వసూళ్లకు పాల్పడుతున్నాడంటూ బీఆర్‌ఎస్
- తప్పుగా చిత్రీకరిస్తున్నారంటూ కార్పొరేటర్ తరఫువారు

మన్సూరాబాద్, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): మన్సూరాబాద్‌లో వాటర్ కనెక్షన్‌లో వసూళ్లకు పాల్పడ్డారంటూ రెండు రోజులుగా సోషల్ మీడియాలో వాయిస్ రికార్డింగులు, వీడియోలు హల్‌చల్ చేస్తున్నారు. డ్రైనేజీ, నీటి కనెక్షన్లలో కోట్ల రూపాయల కుంభకోణం చేస్తున్నాడంటూ స్థానిక బీఆర్ఎస్ తరఫు నాయకులు ఆరోపణలు చేస్తున్నారు. జీహెచ్‌ఎంసీ, హెచ్‌ఎండబ్ల్యూఎస్ అండ్ ఎస్‌బీ అధికారులను తన అదుపులో పెట్టుకుని, కాంట్రాక్టర్లతో అక్రమ వసూళ్లకు పాల్పడుతుంటాడని, ఎవరైనా మాట వినకుంటే బెదిరింపులకు కూడా దిగుతాడంటూ విమర్శిస్తున్నారు. మన్సూరాబాద్ డివిజన్ పరిధిలోని మధురానగర్‌కాలనీలో ఓ ఇంటి యజమాని నీటి కనెక్షన్ విషయం ఈ సామాజిక మాధ్యమాల్లో వివాదానికి దారితీసింది.

ప్రకటనతో కూడిన ఆడియో వైరల్..

సివిల్ కాంట్రాక్టర్‌గా పేర్కొంటూ దూదిమెట్ల శివయాదవ్ అనే వ్యక్తి, కార్పొరేటర్ నడుమ జరిగిన సంభాషణకు సంబంధించి ఆడియో బయటకొచ్చింది. ఇందులో కార్పొరేటర్ మధురానగర్‌లో నీటి కనెక్షన్‌లో భాగంగా రోడ్డు కటింగ్‌కు రూ.75వేలు అడిగావా అంటూ శివను ప్రశ్నించగా ప్రమాణపూర్తిగా తాను వెళ్లలేదని, 'మొన్నటి నుంచి నన్ను ఒకరు ఇబ్బంది పెడుతున్నారు.. మీరు కూడా ఇలా ఇబ్బంది పెడితే మీపేరు రాసి ఆత్మహత్య చేసుకుంటానంటూ శివ ఆవేదనతో పేర్కొంటున్నట్లు కనిపించింది. ఈ ఆడియోను బీఆర్‌ఎస్ నాయకులు సామాజిక మాధ్యమాల్లో ఉంచి కార్పొరేటర్‌పై కోట్ల రూపాయల కుంభకోణం చేస్తూ బీసీ కాంట్రాక్టర్లను బెదిరింపులకు పాల్పడుతున్నాడంటూ ఘాటుగా విమర్శించారు.

బాధితుల ఫిర్యాదుతో హెచ్చరించా: కార్పొరేటర్ నర్సింహారెడ్డి

సివిల్ కాంట్రాక్టర్‌గా చెప్పుకునే శివయాదవ్ హెచ్‌ఎండబ్ల్యూఎస్ సిబ్బందినంటూ అక్రమాలకు పాల్పడుతున్నాడని కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి ఆరోపించారు. అతడి వల్ల ఇబ్బందులు పడుతున్న మధురానగర్‌కాలనీకి చెందిన సోమవరపు శ్రీనివాస్ గుప్తా అనే వ్యక్తి ఇంటి నిర్మాణంలో భా గంగా నీటి కనెక్షన్, రోడ్డు కటింగ్ విషయమై రూ.75వేలు తనను డిమాండ్ చేస్తున్నాడని తనకు ఫిర్యాదు చేశాడన్నారు. ఈ మేరకు శివయాదవ్‌కు ఫో న్ చేసి ఎందుకు డబ్బులు అడుగుతున్నావంటూ ప్రశ్నిస్తూ తిట్టడం జరిగిందని, శివయాదవ్ చేసే మోసాలు చాలా ఉన్నాయన్నారు. తప్పు చేయడమే కాకుండా బీసీ వాదాన్ని ముందుకు వేయడం వెనుక స్థానిక ఎమ్మెల్యే హస్తం ఉందంటూ ఆరోపించారు.

దొంగగా చిత్రీకరించి బెదిరిస్తున్నాడు: శివ

ఇది వరకు కార్పొరేటర్ చెప్పిన పనులన్నీ చేశానని, ఇప్పుడు చేయను అంటే బీసీ బిడ్డనైన తనను దొంగగా చిత్రీకరిస్తూ బెదిరింపులకు పాల్పడుతున్నాడంటూ కార్పొరేటర్‌పై ఆరోపిస్తూ దూదిమెట్ల శివయాదవ్ గురువారం ఓ వీడియోను విడుదల చేశాడు. అందరూ తనకు అండగా ఉండాలంటూ అందులో పేర్కొన్నాడు.

రూ.75వేలు డిమాండ్ చేస్తే కార్పొరేటర్‌కు ఫిర్యాదు చేశా..



తన ఇంటి నిర్మాణంలో భాగంగా నీటి కనెక్షన్‌కు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుంటే కాంట్రాక్ట్ నాకు ఇవ్వాలంటూ దూదిమెట్ల శివయాదవ్ చెప్పేవాడు. ఎవరికి వస్తే వారికే ఇస్తానంటూ చెప్పాను. శ్రీరామచారికి కాంట్రాక్ట్ వచ్చిందని, అది నేను చూస్తున్నానంటూ శివ చెప్పాడు. రోడ్డు కటింగ్‌కు ఫీట్‌కు రూ.2500 చొప్పున రూ.75వేలు చెల్లించాలని చెప్పడంలో నిరాకరించగా పదేపదే ఫోన్లు చేస్తుండడంతో కార్పొరేటర్‌కు ఫిర్యాదు చేశా. దీంతో కార్పొరేటర్ నర్సింహారెడ్డి డబ్బులు ఎందుకు అడుగున్నావంటూ ప్రశ్నించగా తనను ఇబ్బంది పెడితే ఆత్మహత్య చేసుకుంటానని శివ అనడంతో కార్పొరేటర్ ఆగ్రహించారన్నారు. ఈ విషయంలో కార్పొరేటర్‌పై వస్తున్న ఆరోపణల్లో ఎలాంటి నిజం లేదు.

- సోమవరపు శ్రీనివాస్‌గుప్తా, బాధితుడు, మధురానగర్‌కాలనీ, మన్సూరాబాద్

దళారులను నమ్మి మోసపోకండి



ఎవరికైనా వాటర్ కనెక్షన్ కావాలంటే వారే స్వయంగా ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకుంటే 15రోజుల్లో కనెక్షన్ ఇస్తాం. మన్సూరాబాద్ మధురానగర్ ఘటనలో వినియోగదారుడు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకుంటే కనెక్షన్ ఇచ్చాం. దూదిమెట్ల శివయాదవ్ అనే వ్యక్తికి మాకు ఎలాంటి సం బంధం లేదు. గతంలో మా శాఖలో మీటర్ రీడర్‌గా పనిచేసేవాడు. ఇప్పుడు చేయడం లేదు. తమ శాఖ పేరుతో వచ్చి అక్ర మ వసూళ్లకు పాల్పడినట్లు తెలిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం.

- ప్రేమ్‌కుమార్, మేనేజర్, హెచ్‌ఎండబ్ల్యూఎస్, ఎల్బీనగర్

వరదనీటి సమస్యలను శాశ్వతంగా పరిష్కరిస్తా

- ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి



వరదనీటి సమస్యను పరిష్కరించాలని ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డిని కోరుతున్న ఎఫ్‌సీఐ కాలనీవాసులు

వనస్థలిపురం, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): కాలనీవాసులు ఎదుర్కొంటున్న వరదనీటి సమ్యలను శాశ్వతంగా పరిష్కరిస్తామని ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షానికి వనస్థలిపురం డివిజన్ ఎఫ్‌సీఐ కాలనీ ప్రధాన రహదారిపై వరదనీటితో రాకపోకలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయని ఈ సమస్యను పరిష్కరించాలని కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి దృష్టికి గురువారం తీసుకెళ్లారు. తక్షణమే స్పందించిన ఎమ్మెల్యే మాట్లాడుతూ కాలనీవాసులు ఎదుర్కొంటున్న వరదనీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం చేపడతామన్నారు. సంబంధిత అధికారులకు ఫోన్లో ఆదేశించి కాలనీవాసులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా వరదనీటి సమస్యల పరిష్కారానికి తగు చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ డివిజన్ అధ్యక్షుడు చింతల రవికుమార్, కాలనీ అధ్యక్షుడు నర్సింహారావు, ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, రాజుయాదవ్, సత్యనారాయణ, కృష్ణారావు, రాజేశ్వర్‌రావు, వెంకటనారాయణ పాల్గొన్నారు.

యువత స్వయం ఉపాధి అవకాశాలను ఎంచుకోవాలి

ఎల్బీనగర్ : యువత స్వయం ఉపాధి అవకాశాలను ఎంచుకోవాలని ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి సూచించారు. బీఆర్‌ఎస్ లింగోజిగూడ డివిజన్ వర్కింగ్ ప్రెసిడెంట్ రాకేష్‌రాగూర్, సుధీర్‌రాగూర్‌లు నెలకొల్పిన వారాహి ఎంటర్‌ప్రైజెస్ స్టూడియో ప్రారంభోత్సవంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినియోగదారులకు అందుబాటు ధరలతో నాణ్యమైన సేవలందిస్తే వృద్ధిలోకి రావచ్చన్నారు. అక్కడ ఫొటో షూట్ కోసం ఏర్పాటు చేసిన వివిధ రకాల సెట్టింగులను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో ఎల్బీనగర్ పురపాలక సంఘం మాజీ ఫ్లోర్ లీడర్ చిత్తలూరి వెంకటేశ్వర్లు, ముద్దగోని సతీష్‌కుమార్‌గౌడ్, రవి, ఉమామహేశ్వర్‌రావు, సత్యనారాయణగౌడ్ పాల్గొన్నారు.

కాలనీల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి

- ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి



ఆర్‌కేపురం కమ్యూనిటీ హాల్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రంగారెడ్డి

అబ్దుల్లాపూర్‌మెట్, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గం పరిధిలో కొత్తగా వెలుస్తున్న కాలనీలో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తానని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి స్పష్టం చేశారు. పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీ లక్ష్మారెడ్డి పాలెం 23వ వార్డులోని రామకృష్ణపురం కాలనీ నూతన కమ్యూనిటీ హాల్‌ను స్థానిక మాజీ కౌన్సిలర్ సిద్దంకి కృష్ణారెడ్డితో కలిసి ఎమ్మెల్యే మల్‌రెడ్డి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీ పరిధిలో పెద్ద ఎత్తున కొత్త కాలనీలు వెలుస్తున్నాయన్నారు. దశలవారీగా అన్ని కాలనీల్లో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. ప్రభుత్వ, హెచ్‌ఎండీఏ నిధులను సమీకరించి నియోజకవర్గంలో అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. సొంత నిధులతో కాలనీ కమ్యూనిటీ భవనాన్ని నిర్మించుకోవడం అభినందనీయం అన్నారు. ఈ సందర్భంగా కాలనీ అసోసియేషన్‌ను ఎమ్మెల్యే అభినందించారు. కార్యక్రమంలో కాలనీ వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీధర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, కోశాధికారి సూర్యకళావతి, గౌరవ అధ్యక్షుడు శంకర్‌రెడ్డి, స్థానిక నాయకులు పండుగుల రాజు, రాజేందర్‌ముదిరాజ్, విజయేందర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, జైపాల్‌రెడ్డి, జగన్ పాల్గొన్నారు.

పారా అథ్లెటిక్స్ చాంపియన్ షిప్ 2025లో విద్యార్థులకు బంగారు పతకాలు

హయత్‌నగర్, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): నగరంలోని గచ్చిబౌలిలో జరిగిన రెండవ రాష్ట్రస్థాయి పారా అథ్లెటిక్స్ చాంపియన్ షిప్ 2025 పోటీల్లో రంగారెడ్డి జిల్లా తరఫున పాల్గొని పతకాలు సాధించిన విద్యార్థులను ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి గురువారం సన్మానించి అభినందించారు. దివ్య టి 47 క్యాటగిరి విభాగంలో 200మీటర్ల పరుగులో స్వర్ణపతకం సాధించింది. ఎఫ్ 40 క్యాటగిరిలో శిరీష షాట్‌పుట్, జావలిన్ విభాగంలో స్వర్ణపతకం సాధించింది. ధనావత్ యశ్వంత్ 400మీటర్ల పరుగు, లాంగ్‌జంప్ విభాగంలో బంగారు పతకం సాధించాడు. ముగ్గురు విద్యార్థులు హయత్‌నగర్‌లోని ఓ ప్రైవేటు పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నారు. ముగ్గురు విద్యార్థులు ఈనెల 29 నుంచి 31 వరకు మధ్యప్రదేశ్‌లో నిర్వహించనున్న జాతీయ పారా అథ్లెటిక్స్ చాంపియన్ షిప్ 2025 పోటీల్లో పాల్గొనేందుకు అర్హత సాధించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాబోయే రోజుల్లో దేశం గర్వించతగిన క్రీడాకారులుగా ఎదగాలని కోరారు. ఈ సందర్భంగా కోచ్ వినోద్‌కుమార్‌ను ఎమ్మెల్యే అభినందించారు.

షార్ట్ సర్క్యూట్‌తో లేడీస్ టైలర్, కిరాణా షాప్ దగ్ధం

- బూడిదైన 1.80 లక్షల నగదు, తులం బంగారు కమ్మలు
- సుమారు రూ.8 లక్షల ఆస్తినష్టం

చంపాపేట, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): చంపాపేట డివిజన్ కర్మన్‌ఘాట్‌లోని శుభోదయకాలనీ రోడ్డు నెం.7లో ఉన్న శివాని లేడీస్ టైలర్, కిరాణం జనరల్ స్టోర్ విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో గురువారం దగ్ధమైంది. ఎరుకల లావణ్య షాప్ నిర్వహిస్తుండగా మధ్యాహ్నం 1:30 గంటల ప్రాంతంలో భోజనం కోసం షాప్ మూసి ఇంటికి వెళ్లింది. షాప్ మూసి వెళ్లిన తర్వాత షాప్‌లో నుంచి దట్టమైన పొగలు రావడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. మలక్‌పేట, హయత్‌నగర్ ఫైర్‌స్టేషన్ నుంచి రెం డు ఫైరింజన్లు సంఘటనా స్థలానికి చేరుకొని మంటలను ఆర్పాయి. మంటల్లో రెండు కుట్టుమిషన్లు, దుస్తులు, కిరా ణం, లేడీస్ దుస్తులు పూర్తిగా కాలి బూడిదయ్యాయి. షాప్‌లోని కౌంటర్‌లో ఉన్న 1.80 లక్షల నగదు, తులం బంగారు కమ్మలు కాలిపోయినట్లు షాప్ యజమాని లావణ్య పేర్కొంది. షాప్‌లో సుమారు రూ.8 లక్షల విలువైన వస్తువులు అగ్నికి ఆహుతి అయినట్లు, ప్రభుత్వం తనను ఆదుకోవాలని బాధితురాలు రోదిస్తూ పేర్కొంది. కార్పొరేటర్ వంగా మధుసూదన్‌రెడ్డి, సరూర్‌నగర్ మండల రెవెన్యూ ఆర్‌ఐ గీత, సీఐ సైదిరెడ్డి, ఆయా ఫైర్‌స్టేషన్ల ఇన్‌చార్జీలు షౌకత్, యాదయ్య సంఘటనా స్థలాన్ని పరిశీలించారు.



మంటలను ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది



శుభోదయకాలనీలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధమవుతున్న శివాని లేడీస్ టైలర్, కిరాణం జనరల్ స్టోర్

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన



కొత్తగూడ ఫ్రూట్ మార్కెట్ చౌరస్తాలో ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పిస్తున్న టీటీఐ అధికారులు

కొత్తపేట, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): రాచకొండ పరిధిలోని మన్సూరాబాద్ ఎంపీపీ స్కూల్ రామంతపూర్‌లో ప్రైవేటు విద్యాసంస్థలో, వనస్థలిపురం, ఆటోనగర్, హయత్‌నగర్, పెద్దంబర్‌పేట, అబ్దుల్లాపూర్‌మెట్, కొత్తగూడ ఫ్రూట్ మార్కెట్ తదితర ప్రాంతాల్లో 449మంది విద్యార్థులకు, వాహనదారులకు గురువారం ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించామని రాచకొండ ట్రాఫిక్ ట్రెయినింగ్ ఇనిస్టిట్యూట్(టీటీఐ) ఆర్‌ఎస్‌ఐ సంతోష్ కుమార్, ఏఎస్‌ఐ సోమ్‌నాథ్ తెలిపారు. పాఠశాలలు, ప్రధాన కూడళ్లలో 15 కార్యక్రమాలు నిర్వహించామన్నారు. విద్యార్థులకు కరపత్రాలు తెలుగు, ఇంగ్లీషు సూచనలతో రూపొందించిన ఏబీసీ ఆఫ్ రోడ్డు సేఫ్టీ ఫర్ చిల్డ్రన్ బుక్‌లెట్స్ పంపిణీ చేశామని పేర్కొన్నారు. రహదారి భద్రత, ట్రాఫిక్ నిబంధనల ప్రాధాన్యతలను వివరించామన్నారు.

మద్యంమత్తులో వాహనాలు నడపవద్దు

కొత్తపేట : మద్యంమత్తులో వాహనాలు నడపవద్దని రాచకొండ ట్రాఫిక్ ట్రెయినింగ్ ఇనిస్టిట్యూట్(టీటీఐ) ఇన్‌స్పెక్టర్ ఎస్‌పీఓ అమరవర్ధన్‌రెడ్డి వివరించారు. రాచకొండ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్ వాహనాల తనిఖీల్లో మద్యం తాగి వాహనాలు నడిపి పట్టుబడిన వారిలో 49 మంది మద్యం ప్రియులకు 49 మంది కుటుంబ సభ్యుల సమక్షంలో గురువారం టీటీఐ లెక్చర్‌హాల్‌లో కౌన్సిలింగ్ నిర్వహించారు. తొలుత సిబ్బంది వారికి మద్యంమత్తులో వాహనాలు నడిపితే చోటు చేసుకున్న ప్రమాదాల క్లిప్పింగ్స్, మద్యంమత్తులో ప్రమాదాలపై ప్రముఖుల సందేశాలు గీతాలు ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ ఎస్‌పీఓ అమరవర్ధన్‌రెడ్డి ఇలాంటి ప్రమాదాల కారణంగా మిగిలే నష్టాన్ని వారికి వివరించారు.



మాట్లాడుతున్న ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి సల్మాఫాతిమా

తల్లిదండ్రులను అనాథలుగా మార్చొద్దు

- ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి సల్మాఫాతిమా

అబ్దుల్లాపూర్‌మెట్, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రులను అనాథులుగా మార్చొద్దని హయత్‌నగర్ కోర్టు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి సల్మా ఫాతిమా అన్నారు. ప్రపంచ సీనియర్ సిటిజన్స్ దినోత్సవాన్ని మండల లీగల్ సర్వీస్ కమిటీ ఆధ్వర్యంలో గురువారం పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీ కుంట్లూర్ శివశంకర్ కాలనీలోని అనాథ వృద్ధాశ్రమంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జడ్జి సల్మా ఫాతిమా ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ తల్లిదండ్రులకు వృద్ధాప్యం రాగానే కొందరు పిల్లలు అనాథ ఆశ్రమాలకు పంపించి వారిని కడుపుకోతకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తల్లిదండ్రులను కంటికి రెప్పలా చూసుకోవాల్సిన బాధ్యత పిల్లలపై ఉంటుందన్నారు. వృద్ధాప్యంలో వారిని ఇబ్బందులకు గురిచేస్తున్న పిల్లలను చట్టం కఠినంగా శిక్షిస్తుందని హెచ్చరించారు. సీనియర్ సిటిజన్స్ ఇబ్బందులకు గురైతే కోర్టును ఆశ్రయించవచ్చని చట్టం వారికి న్యాయం చేస్తుందన్నారు. అనంతరం ఆశ్రమంలోని వృద్ధులకు బియ్యం, ఫ్రూట్స్, స్నాక్స్ అందజేశారు. కార్యక్రమంలో హయత్‌నగర్ ఇన్‌స్పెక్టర్ నాగరాజు, బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ మోడెం ప్రభాకర్, ప్రధాన కార్యదర్శి బండి నరేష్, రామ్మోహన్, సతీష్, స్మృతితో పాటు సీనియర్ సిటిజన్స్ పాల్గొన్నారు.



వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహిస్తున్న డీసీపీ చైతన్యకుమార్

పండుగలను శాంతియుతంగా జరుపుకోవాలి

సైదాబాద్ ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): జంట పండుగల నేపథ్యంలో పోలీసులు నిర్వహించాల్సిన ఏర్పాట్లపై గురువారం సైదాబాద్ పోలీస్‌స్టేషన్ హాల్‌లో వివిధ శాఖల అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా సౌత్ ఈస్ట్ జోన్ డీసీపీ చైతన్యకుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న వినాయక చవితి, మిలాద్-ఉన్-నబీ పండుగలను ప్రజలు శాంతియుత వాతావరణంలో జరుపుకొనేలా చూడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఫిర్యాదులు అందిన వెంటనే సత్వరమే పరిష్కారానికి కృషి చేయాలని తెలిపారు. గణేశ్ మండపాల నిర్వహణ, ఊరేగింపులు జరుగుతున్న సమయంలో శాంతి భద్రతలకు విఘాతం కలుగకుండ చర్యలు తీసుకోవాలని, గణేశ్ మండప నిర్వాహకులకు నియమ నిబంధనలు పాటించేలా సూచనలు ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ జోనల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి, ఏసీపీలు సోము వెంకట్ రెడ్డి, సుబ్బిరాంరెడ్డి, శ్యాంసుందర్, ఇన్‌స్పెక్టర్లు చంద్రకుమార్, ఆనంద్, విద్యుత్, ఫైర్, హెల్త్, ట్రాఫిక్, జలమండలి, ఆర్‌అండ్‌బీ అధికారులు పాల్గొన్నారు.

గణేశ్ ఉత్సవాలను..

చాదర్‌ఘాట్, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): గణేశ్ నవరాత్రి ఉత్సవాలను చాదర్‌ఘాట్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఉత్సవ సమితి నిర్వాహకులు శాంతియుతంగా జరుపుకోవాలని ఇన్‌స్పెక్టర్ బ్రహ్మమురారీ తెలిపారు. చాదర్‌ఘాట్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని గణేశ్ నవరాత్రి ఉత్సవ సమితి నిర్వాహకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గణేశ్ నవరాత్రి ఉత్సవాల నిర్వహణకు నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ విధించిన నియమ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని విజ్ఞప్తి చేశారు. నిబంధనలను అతిక్రమించిన వారి పట్ల చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. గణేశ్ ఉత్సవాల నిర్వహణకు పోలీసుల అనుమతి తప్పనిసరి అని ఆయన తెలిపారు. కార్యక్రమంలో చాదర్‌ఘాట్ అదనపు ఇన్‌స్పెక్టర్ భూపాల్‌గౌడ్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

హనుమాన్ ఆలయంలో ముగిసిన వేలం

చంపాపేట, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): చంపాపేట డివిజన్ కర్మన్‌ఘాట్‌లోని హనుమాన్ ఆలయంలో పార్కింగ్ నిర్వహణ, కొబ్బరి చిప్పలు, అమ్మవార్ల చీరల సేకరణ కోసం గురువారం నిర్వహించిన వేలం పాటలు ముగిశాయి. రంగారెడ్డి జిల్లా దేవాదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ చంద్రశేఖర్ పర్యవేక్షణలో ఆలయ ఈవో ఎస్.లావణ్య నిర్వహించిన వేలం పాటలో సుభాష్ వాహనాల పార్కింగ్ నిర్వహణ కోసం రూ.18.50లక్షలు, ఎన్. మల్లయ్య కొబ్బరి చిప్పల సేకరణ కోసం రూ.14.50లక్షలు, కరుణాకర్ అమ్మవార్ల చీరల సేకరణ కోసం రూ.1.45లక్షలకు దక్కించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు ఎనుముల రవీందర్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, కవిత, గోపాల్‌రెడ్డి, నాగరాజు, కిరణ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

69వ ఇంటర్ జోనల్ స్పోర్ట్స్ మీట్ ప్రారంభం

చాదర్‌ఘాట్, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): మూసారాంబాగ్‌లోని స్వామి వివేకానంద సెంటినరీ హైస్కూల్‌లో గురువారం హైదరాబాద్ జిల్లా స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో 69వ ఇంటర్ జోనల్ స్పోర్ట్స్ మీట్ ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా విచ్చేసిన మూసారాంబాగ్, సైదాబాద్ డివిజన్ల కార్పొరేటర్లు బొక్క భాగ్యలక్ష్మీరెడ్డి, కొత్తకాపు అరుణరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు కూడా ముఖ్యమన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో డిప్యూటీ ఈవో డి.సుకన్య, సైదాబాద్-1 డిప్యూటీ ఐఓఎస్ జీవర ప్రసాద్, సైదాబాద్-2 డిప్యూటీ ఐఓఎస్ వెంకటరెడ్డి, శ్రీదేవి, ప్రధానోపాధ్యాయులు శివకుమార్, ఓం హరికృష్ణ పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి | ఆంధ్రజ్యోతి ద్వారా జన్మదిన, వివాహ, షష్టిపూర్తి, పదవీ విరమణ, వ్యాపార, ఉద్యోగ, లీగల్ నోటీసులు, బహిరంగ ప్రకటనలు మరియు ఏ ఇతర ప్రకటనలైనా సంప్రదించండి | రాజు : 99854 02786